
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల జిల్లా వార్తలు
గురువారం 21 నవంబరు 2024







ప్రకృతి.. ఆకృతి..

నల్లమల అడవుల్లో కొండలను ఒరుసుకుంటూ పారే కృష్ణానది.. పర్వతాల మధ్య జలాశయం.. చూసి అనుభూతి చెందాల్సిందే. మాటల్లో వర్ణించడం ఎవరికీ సాధ్యం కాదు. చూడగానే నల్లమల ప్రకృతిలోని ఆకృతులు మన మనసులను కట్టిపడేస్తాయి. మనో ఉల్లాసం కలిగిస్తాయి. ఎంత కష్టమైనా సరే ఇష్టంగా వెళ్లి చూడాలనిపిస్తుంది. చుట్టూ పచ్చదనం విచ్చుకున్న నల్లమల.. మధ్యలో ప్రశాంతంగా ఉన్న కృష్ణమ్మ... అంతటి అనిర్వచనీయమైన ప్రకృతి సోయగాలను తిలకించాలంటే శ్రీశైలానికి వెళ్లాల్సిందే. శ్రీశైలంలోని రుద్రపార్కు వ్యూ పాయింట్ నుంచి శ్రీశైలం కొండలు, ప్రాజెక్టు అందాలను 'ఆంధ్రజ్యోతి' బుధవారం ఇలా తన కెమెరాలో బంధించింది.

- శ్రీశైలం

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై సదస్సు



ఎస్సీ, ఎస్టీ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు

నంద్యాల క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, పోక్సో చట్టాలపై గడివేముల గ్రామ ఏపీ మోడల్ స్కూల్‌లో పోలీస్ అధికారులు సదస్సు ఏర్పాటు చేశారు. కర్నూలు సీఐడీ రీజినల్ ఆఫీసు ఆర్ఓ, డీఎస్పీ వాహిద్‌బాషా, నంద్యాల డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సదస్సులో పోలీసు అధికారులు ఎస్సీ, ఎస్టీ వర్గాలపై అఘాయిత్యాలు, వివక్షను నివారించడానికి రూపొందించిన ఎస్సీ, ఎస్టీ, పీఓఏ చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించారు. కుల ఆధారిత హింస, వివక్ష, సాంఘిక బహిష్కరణతోసహా కమ్యూనిటీల సభ్యులపై చేసిన నేరాలకు కఠినమైన శిక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీల హక్కుల గురించి తెలియజేశారు. ఈ కమ్యూనిటీలపై అట్రాసిటీ, వివక్ష, హింస కేసులను ఎలా నిర్వహించాలనే దానిపై చట్టాన్ని అమలు చేసే అధికారులు, ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే న్యాయపరమైన వనరులు, న్యాయం కోరే ప్రక్రియ గురించి తెలియజేయడం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలను బలోపేతం చేసేందుకు ఆస్కారం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు అధికారులు వివక్ష, హింసను ఎలా నిరోధించాలనే దానిపై వివరణాత్మక సందేశం ఇచ్చారు. ఈ అవగాహన సదస్సులో జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు అవగాహన కల్పించారు. జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి చింతామణి, ఎంపీడీవో వాసుదేవ గుప్త, తహసీల్దార్ వెంకటరమణ, సీఐడీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, పాణ్యం ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, గడివేముల ఎస్సై సీసీ నాగార్జునరెడ్డి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, కొమ్ముపాలెం శ్రీనివాసులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఈనాటిది కాదు. స్వాతంత్ర్యానికి పూర్వమే 1937 నుంచి సీమ ప్రజల హృదయాల్లో ఉంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాలుగా స్వప్నంగానే మిగిలిపోయింది. కర్నూలులో 'హైకోర్టు బెంచ్' ఏర్పాటు చేస్తాం అంటూ 2019 ఎన్నికల్లో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. అధికారం చేపట్టిన వైసీపీ న్యాయ రాజధాని, హైకోర్టు.. అంటూ ఐదేళ్లు మభ్యపెట్టింది. ఎన్నికల్లో ఓట్ల కోసం ఎన్నో ఎత్తులు వేసింది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం.. అధికారంలోకి రాగానే ప్రక్రియ మొదలు పెడతామని 'ప్రజాగళం' సభలో అప్పటి ప్రతిపక్ష నేతగా చంద్రబాబు హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే కసరత్తు మొదలు పెట్టారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం తక్షణ చర్యలు మొదలు పెట్టాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు టీడీపీ కూట మి ప్రభుత్వం లేఖ రాసింది. అంతేకాకుండా బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తీర్మానం చేశారు.



కర్నూలులో హైకోర్టు బెంచ్..!

మంత్రివర్గ సమావేశంలో తీర్మానం

- హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- 'ప్రజాగళం' సభలో చంద్రబాబు స్పష్టమైన హామీ
- న్యాయ రాజధాని, హైకోర్టు పేరిట గత ఐదేళ్లలో మోసం
- టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో కదులుతున్న బెంచ్ ఫైల్

కర్నూలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ (సీడెడ్ జిల్లాలు), ఆంధ్ర ప్రాంతం మద్రాసు రాష్ట్రంలో ఉండేవి. తమిళులు ఆధిపత్యం కారణంగా 1913లో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి బీజం పడింది. అయితే ఈ విషయంలో కోస్తాంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య వివిధ అంశాలపై విభేదాలు తలెత్తాయి. అపోహాలు, విభేదాలు తొలగించేందుకు ఇరుప్రాంతాలకు చెందిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, హాలహర్వి సీతారామిరెడ్డి, కడప కోటిరెడ్డి, కొండా వెంకటప్పయ్య, టీఎన్ రామకృష్ణారెడ్డి, మహబూబ్ అలీబేగ్, దేశిరాజు హనుమంతరావు, కల్లూరు సుబ్బారావు, వరదాచారి, పప్పూరి రామాచారి, సుబ్బరామిరెడ్డి, దేశపాండ్య సుబ్బారావు, మల్లిపూడి పల్లం రాజులతో ఏర్పడిన సంఘం 1937 నవంబరు 16న మద్రాస్‌లోని కాశీనాథుని నాగేశ్వరరావు స్వగృహం 'శ్రీబాగ్' భవనంలో సమావేశమైంది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటయ్యాక 1. రాజధాని లేదా హైకోర్టు రాయలసీమలో ఏర్పాటు, 2. కృష్ణా, తుంగభద్ర జలాలలో రాయలసీమ, నెల్లూరుకు ప్రథమ ప్రాధాన్యత, 3. రాయలసీమలో విశ్వవిద్యాలయం, 4. శాసనసభ స్థానాల్లో ఇరుప్రాంతాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.. అనే అంశాలపై ఏకాభిప్రాయంతో ఒప్పందం చేసుకున్నారు. శ్రీబాగ్ భవనంలో ఒప్పందం జరగడంతో 'శ్రీబాగ్ ఒడంబడిక'గా పిలుస్తూ వచ్చారు. 1952 అక్టోబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు తరువాత రాయలసీమ ప్రాంతం కర్నూలులో రాజధాని, కోస్తాంధ్ర ప్రాంతం గుంటూరులో హైకోర్టు ఏర్పాటు చేశారు. 1956 నవంబరు 1న ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేశారు. రాజధాని, హైకోర్టు హైదరాబాద్‌కు తరలిపోయాయి. శ్రీబాగ్ ఒప్పందం నీరుగారిపోయింది. 2014లో రాష్ట్ర విభజన తరువాత శ్రీబాగ్ ఒడంబడిక అమలు డిమాండ్ తెరపైకి వచ్చింది. అమరావతి రాజధానిగా చేయడంతో కర్నూలులో హైకోర్టు పెట్టాలనే న్యాయవాదులు, విద్యార్థులు ఉద్యమాలకు సై అన్నారు.

మిగతా 7లో..

వివాదాల ఆలూరు

- పోలీసు స్టేషన్‌పై పట్టు కోసం అధికార పార్టీ నేతల మధ్య పోటీ
- విధుల్లో చేరిన నాలుగు నెలలకే వీఆర్‌లోకి ఇద్దరు పోలీసు అధికారులు
- అధికారుల మధ్య విభేదాలకు ఆజ్యం పోస్తున్న కింది స్థాయి ఉద్యోగులు

ఆలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆలూరు పోలీసు సర్కిల్ స్టేషన్ వివాదాలకు నిలయంగా మారింది. విధుల్లో చేరిన నాలుగు నెలలకే ఇద్దరు పోలీసు అధికారులు వీఆర్‌లోకి వెళ్లడం చర్చనీయాంశమైంది. అధికార పార్టీలో నేతల మధ్య ఉన్న వర్గ విభేదాల కారణంగా నాలుగు నెలల వ్యవధిలో సీఐ శ్రీనివాస నాయక్, ఎస్ఐ వెంకట నరసింహులు వీఆర్‌లోకి వెళ్లారని తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక ఆలూరు సర్కిల్ సీఐగా శ్రీనివాస నాయక్, ఎస్సైగా వెంకట నరసింహులుకు అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే, టీడీపీ ముఖ్య నేత ఒకరు కలిసి పోస్టింగ్ ఇప్పించారు. అయితే అదే పార్టీలో ఉన్న మరో నేతకు పోలీసు స్టేషన్‌లో వారి పెత్తనం మింగుడు పడలేదు. పోలీసులు తాము చెప్పిన పని చేయడం లేదని జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఇద్దరు పోలీసు అధికారులు ఒకే వర్గానికి పని చేసి విధంగా వ్యవహరిస్తున్నారని చర్యలు తీసుకున్నారు.

ఇద్దరు అధికారుల వీఆర్‌కు కారణలెన్నో..?

ఆలూరు పోలీసు సర్కిల్‌లో ఇద్దరు పోలీసు అధికారులపై చర్యలకు అవినీతి ఆరోపణలు



ఆలూరు పోలీసు స్టేషన్

కారణమని పోలీసు ఉన్నతాధికారులు చెబుతుండగా మరో అంశం కూడా తెరపైకి వచ్చింది. వాస్తవంగా నియోజకవర్గంలో పేకాట స్థావరాలపై ఓ అధికార పార్టీ నేత పోలీసులకు సమాచారం ఇచ్చి అరెస్టు చేయించగా అందులో మరో నేత అనుచరులు పట్టుబడ్డారు. దీంతో ఇద్దరి నేతల మధ్య వర్గాల మధ్య ఈ ఘటన ఆజ్యం పోసినట్టయింది. తమ అనుచరులనే అరెస్టు చేస్తారా అంటూ ఓ నేత పోలీసుల తీరుపై ఆగ్రహించినట్లు సమాచారం. మరో వైపు ఓ టీడీపీ నేత ఫిర్యాదు మేరకు ఆలూరులోని క్లబ్‌ను ఎస్సై మూసివేయడంతో మరోవర్గం నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. అధికార పార్టీ వర్గ పోరు వల్లే ఆలూరు పోలీసు స్టేషన్‌లో ఇద్దరు అధికారులు బలి అయినట్లు తెలుస్తోంది.

మిగతా 6లో..



సొంతూరిపై మమకారం

తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ విస్తృత సేవలు
అగ్రరాజ్యంలో తెలుగు తేజం

6లో

ఇద్దరు రైతుల బలవన్మరణం

7

ఎండుమిర్చి ధర పైపైకి..

క్వింటా గరిష్ఠంగా రూ.15,513


వేతనదారుల సంఖ్య పెంచాలి

కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్, ఉపాధి హామీ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో వేతనదారుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ రాజకుమారి ఏపీఓ, ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉపాధి హామీ లక్ష్యాలు, ఇళ్లనిర్మాణాల ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద వేతనదారులకు పనులు కల్పించడంలో పగిడ్యాల, కొత్తపల్లి, ఆత్మకూరు, డోన్, బెతంచెర్ల తదితర మండలాలు పూర్తిగా వెనకబడి ఉన్నాయని, గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పించాలని అన్నారు. హార్టికల్చరల్ ప్లాంటేషన్‌కు సంబంధించి 2900 ఎకరాలకుగాను 2200 ఎకరాలు పూర్తి చేశారని, మిగిలిన 700 ఎకరాలు పెండింగ్‌లో ఉన్న మండలాలు వారం రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామానికి రెండు ఫారం పాండ్స్, మండలానికి పదిచొప్పున ఫిష్ పాండ్స్, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. 850 పశువుల షెడ్ల నిర్మాణాలకు గాను 751 షెడ్లకు మాత్రమే పరిపాలన ఉత్తర్వులు మంజూరు చేస్తే 327 షెడ్లు మాత్రమే గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాల స్టేజ్ కన్వర్షన్, పూర్తి చేయడంలో వెనుకబడి ఉన్నామని హౌసింగ్ డీఈలు, ఏఈలు ప్రత్యేక శ్రద్ధ పెట్టి గృహాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శిరివెళ్ల, వెలుగోడు, మండలాల్లో 90 రోజుల హౌసింగ్‌లో కూడా ప్రగతి లేదని అన్నారు. లబ్ధిదారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు.



తుంగభద్ర జలాశయం (ఫైల్)



గోడు వినండి..!

- తుంగభద్ర బోర్డు అకౌంట్ ఫ్రీజ్
- ఉద్యోగులకు జీతాలు లేనట్టే
- ఆందోళనలో టీబీపీ ఉద్యోగులు
- వైసీపీ పాపాలు.. ఉద్యోగులకు శాపాలు

కర్నూలు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర బోర్డు పనుల్లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు ప్రస్తుతం బోర్డు ఉద్యోగుల పాలిట శాపంగా మారాయి. మూడు నెలలుగా జీతాలు అందక ఆర్థిక అవస్థలు పడుతున్నారు. బోర్డు అకౌంట్ ఫ్రీజ్ తొలగించి.. నవంబరు ఆఖరులో ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఖర్చు చేయకపోతే వెనక్కి వెళ్తాయని, అదే జరిగితే వచ్చే ఏడాది మే వరకు జీతాలు కూడా వచ్చే అవకాశం ఉండదని బోర్డు ఉద్యోగులు ఆందోళన చెదుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర బోర్డు పనుల్లో అవినీతి అక్రమాలు జరిగి ఉంటే.. సంబంధిత కాంట్రాక్టర్లపై సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) విచారణ చేయించాలి. అవసరమైతే చట్టరమైన చర్యలు తీసుకోవాలే కానీ ఇలా ఖాతాలను సీజ్ చేసి నిధులు లేకుండా చేయడం ఏమిటని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో తుంగభద్ర కాలువ ఆధునీకీకరణ పేరిట దాదాపు రూ.919 కోట్లకు టెండర్లు పిలిచారు. తొలి దశలో రూ.519.80 కోట్లతో ఎల్లెల్సీ ఆర్‌సీసీ లైనింగ్ పనులు చేస్తే.. సుమారు రూ.350 కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. రెండవ దశలో మరో రూ.400 కోట్లకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఈ పనుల్లో వైసీపీ హయాంలో బోర్డులో పని చేసిన ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు, ఏపీ ప్రభుత్వం ఓ ఈఎన్‌సీతో పాటు బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన బడా కాంట్రాక్టర్ ఒకరు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కాంట్రాక్టరు గత ఎన్నికల్లో ప్రకాశం జిల్లా గిద్దలూరు వైసీపీ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశాడు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక తుంగభద్ర బోర్డు పనుల్లో అక్రమాలు జరిగాయని, వాటిని నిగ్గు తేల్చాలని అనంతపురం జిల్లాకు చెందిన రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు ప్రభుత్వానికి లేఖ రాశారు. బోర్డు పనుల్లో అక్రమాలపై విచారణ చేసి నిగ్గు తేల్చే వరకు తుంగభద్ర బోర్డుకు కేటాయించిన నిధులు వినియోగించ కూడదని, ఎలాంటి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) ఇవ్వవద్దని ఏపీ ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రెటరీ టీబీపీ బోర్డు కార్యదర్శి, కర్ణాటక ప్రభుత్వం ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శికి లేఖ రాయడం.. ఆ వెంటనే బోర్డు ఖాతాను ఫ్రీజ్ చేసిన సంగతి తెలిసిందే.

మిగతా 6లో..



విద్య, వైద్య సేవలు అందించడమే ధ్యేయం

తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్య సేవలు అందించడమే ధ్యేయం. చైతన్య స్రవంతి కార్యక్రమం ద్వారా జానపద, సాహిత్య కళలు, కూచిపూడి తదితర సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఉన్నత చదువుల కోసం అమెరికాకు వచ్చిన తెలుగు విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందిస్తున్నాం. తానాతో పాటు నిరంజన్ శృంగవరపు ఫౌండేషన్ ద్వారా సామాజిక, సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నాం. క్యాన్సర్ మహమ్మారిని ముందుగానే గుర్తించేందుకు గ్రామాల్లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మహిళా సాధికారతకు కృషి చేస్తున్నాం.

- శృంగవరపు నిరంజన్, తానా అధ్యక్షుడు



రాజనగరంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

సొంతూరిపై మమకారం..

స్ఫూర్తి

పేదలకు అభయం

- ప్రవాసాంధ్రుడు.. సేవా నిరంజనుడు
- అగ్రరాజ్యంలో తెలుగు తేజం
- గ్రామీణ స్థాయి నుంచి అంచలంచెలుగా ..
- తెలుగు రాష్ట్రాల్లో సామాజిక, సేవా కార్యక్రమాలు
- తానా అధ్యక్షుడిగా శృంగవరపు నిరంజన్ విస్తృత సేవలు

కొందరు ఎంత ఎత్తు ఎదిగినా సొంతూరిని మర్చిపోలేరు. విదేశాల్లో ఉంటూ పుట్టి పెరిగిన ఊరిలో నిత్యం సేవా కార్యక్రమాలు చేస్తూనే ఉంటారు. కన్నతల్లిని.. పుట్టిన ఊరిని మర్చిపోకూడదనే ఏకైక లక్ష్యంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు శృంగవరపు నిరంజన్. ప్రపంచంలోనే అగ్రరాజ్యమైన అమెరికాలోని ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా) అధ్యక్షుడిగా అక్కడి తెలుగు వారితో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో శృంగవరపు నిరంజన్ విశేష సేవలు అందిస్తున్నారు. మారుమూల గ్రామంలో పుట్టి అరకొరగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని కృషి, పట్టుదలతో శ్రమించి ఉన్నత చదువులు చదివి ఖండాంతరాలు దాటి అమెరికాలో స్థిరపడిన నిరంజన్ ఎంతోమంది యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కన్నఊరి రుణం తీర్చుకుంటున్నారు.

తానాలో చిరకాల సేవలు

- 2008లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం సభ్యుడిగా చేరారు.
- 2009-11లో నేషనల్ అడహక్ (ఫైనాన్స్ ఫండ్ రైజింగ్) కమిటీ చైర్మన్‌గా పని చేశారు.
- 2013-15లో తానా ఫౌండేషన్ ట్రస్టీగా సేవలందించారు.
- 2015 నుంచి 2017 వరకు తానా ఫౌండేషన్ ట్రెజరర్‌గా, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా...
- 2017-18లో తానా ఫౌండేషన్ చైర్మన్‌గా, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఎక్స్ అఫీషియో మెంబర్‌గా, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా పని చేశారు.
- 2017-19లో తానా ఫౌండేషన్ ట్రస్టీగా, బైలాస్ మెంబర్‌షిప్ వెరిఫికేషన్, ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ సభ్యుడిగా వ్యవహరించారు.
- 2023లో నిర్వహించిన తానా ఎన్నికల్లో పోటీ చేసి విజయం సాధించారు. 2023 నుంచి 2025 వరకు తానా అధ్యక్షుడిగా సేవలు అందించనున్నారు.

తెలుగు ప్రజల సంక్షేమం కోసం 'తానా'

ఉత్తర అమెరికాలోని తెలుగు ప్రజల సంక్షేమం కోసం తానా కృషి చేస్తోంది. తానా ఫౌండేషన్, టీం స్క్వేర్‌లు అంతర్భాగంగా తానా విశేష సేవలు అందిస్తోంది. అక్కడ జన్మించిన తెలుగు చిన్నారులకు పాఠశాల అనే కార్యక్రమం ద్వారా తెలుగు నేర్పుతున్నారు. ఏటా 4 వేల మంది వరకు తెలుగు అభ్యసిస్తున్నారు. అమెరికాలో మృతి చెందిన తెలుగు వ్యక్తుల మృతదేహాలను స్వదేశంలోని కుటుంబసభ్యులకు అప్పగించేందుకు టీం స్క్వేర్ ద్వారా సహకారం అందిస్తున్నారు. చదువుకునేందుకు వచ్చిన, ఉద్యోగాలు చేస్తున్న తెలుగు వ్యక్తులు రహదారి ప్రమాదాలకు గురైనా.. నివాసాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించి ఇబ్బందుల్లో ఉన్నా టీం స్క్వేర్ ద్వారా సేవలు అందిస్తున్నారు. అమెరికాలో సాంస్కృతిక, సామాజిక, సాహిత్య, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తూ అగ్రరాజ్యంలో తెలుగుదనం ఉట్టిపడేలా చేస్తున్నారు.

ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవలు

సర్వేశ చారిటబుల్ ట్రస్ట్, నిరంజన్ శృంగవరపు ఫౌండేషన్(ఎన్ఎస్ఎఫ్) ద్వారా తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా నిరంజన్ స్వగ్రామమైన రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో వెయ్యి డాలర్లతో లైబ్రరీని ఏర్పాటు చేయించారు. గ్రామంలో రామాలయం నిర్మాణం కోసం రూ.లక్ష విరాళంగా ఇచ్చారు. ఖమ్మం జిల్లా గోల్డెన్ పహాడ్‌లో రూ.6 లక్షలతో సురక్షిత మంచినీటి ప్రాజెక్టును నిర్మించారు. రాజనగరంలో రూ.7 లక్షలు వెచ్చించి అత్యాధునిక వైద్య సామగ్రితో కంటి వైద్య శిబిరం నిర్వహించి శస్త్రచికిత్సలు చేయించారు. కడపలోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి పది వేల డాలర్లను అందజేశారు. ఏపీ, తెలంగాణలోని ప్రతిభ కలిగిన వందలాది విద్యార్థులకు ఉపకార వేతనాలు, ల్యాప్‌టాప్‌లతో పాటు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వారికి అవసరమైన ఆర్థిక, సామాజిక ప్రోత్సాహాన్ని అందజేశారు. దొర్నిపాడు మండలం బుర్రారెడ్డిపల్లెలో శుద్ధజల కేంద్రాన్ని నిర్మించారు. రాజనగరం, గాంధీనగరం, గుంప్రమాన్‌దిన్నెలోని విద్యార్థులకు సైకిళ్లు, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.



సమాజసేవ గురించి సినీ యాక్టర్ సోనూసూద్‌తో

శిరివెళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం రాజనగరం గ్రామానికి చెందిన శృంగవరపు సుబ్రహ్మణ్యం, ఇంద్రావతి దంపతుల మొదటి కుమారుడు శృంగవరపు నిరంజన్. తల్లిదండ్రులకు వ్యవసాయమే జీవనాధారం. తల్లిదండ్రులు అందించిన ప్రోత్సాహంతో నిరంజన్ పదో తరగతి వరకు స్వగ్రామమైన రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్ యర్రగుంట్ల ప్రభుత్వ కళాశాలలో చదివారు. కర్ణాటకలోని గుల్బర్గా విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పట్టా సాధించి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ ఐటీ రంగంలో రాణించేందుకు 2001లో అమెరికా వెళ్లారు. అనంతరం 2003లో ఐటీ బిజినెస్ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్‌లోకి ప్రవేశించ డానికి ముందు డైమ్లెర్ క్రిస్లర్, ఐబీఎం సంస్థల కోసం పని చేశాడు. అనంతరం అమెరికాలో ఐటీ రంగానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని డెట్రాయిట్‌లోని నోవిలో 2003లో సొంతంగా సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించారు.

ప్రపంచంలో ఉన్నత శ్రేణికి చెందిన లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థల్లో ఒకటైన తానా అభివృద్ధికి నిరంజన్ తనవంతు బాధ్యతగా డబ్బును విరాళంగా ఇవ్వడంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో సంస్థ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తానా ఫౌండేషన్‌లో వివిధ ప్రాజెక్టుల కోసం తెలుగు సంఘం నుంచి 50 వేల డాలర్లను సేకరించారు. అండర్ ప్రివిలేజ్డ్ పిల్లలను పెంచడం, వారి సహాయం కోసం చేయూత స్కాలర్‌షిప్ ప్రోగ్రాంను ప్రారంభించారు. వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీకి ఆదరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాలల్లోని విద్యార్థుల కోసం 25కు పైగా లైబ్రరీ ప్రాజెక్టులను ఏర్పాటు చేయించారు. కొవిడ్-19 సహాయ చర్యల్లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో లక్ష కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లు, 3 లక్షల మందికి ఆహారం పంపిణీ, 6 లక్షల ఫేస్ మాస్కులు పంపిణీ చేశారు. ఇటీవల విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం తానా ఫౌండేషన్ ద్వారా రూ.1.10 కోట్ల విలువ చేసే నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు.

'తానా' కోసం తన వంతుగా..



నిరంజన్‌ను సన్మానిస్తున్న శిరివెళ్ల మండల ప్రజలు



అమెరికాలో విద్యార్థులకు బ్యాక్ ప్యాక్‌లు పంపిణీ

బాలల హక్కులను పరిరక్షించాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది



బహుమతులు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూలు లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులను ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది అన్నారు. బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన బుధవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలు చెడు అలవాట్లకు లోనుకాకుండా సన్మార్గంలో పయనించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు వెంకట హరినాథ్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, డిప్యూటీ డీఈవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిశీలన గృహంలో బాలల దినోత్సవ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పరిశీలన గృహం సూపరింటెండెంట్ హుశేన్‌బాషా, ఐసీడీఎస్ చైర్‌పర్సన్ జుబేదాబేగం, న్యాయవాది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్- 2 సిల్వర్ జూబ్లీ అధ్యాపకురాలికి అరుదైన గౌరవం

అంతర్జాతీయ సెమినార్‌కు ఫమీదా బేగం

సిల్వర్‌జూబ్లీ కళాశాల అధ్యాపకురాలికి అరుదైన గౌరవం



కర్నూలు అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సెమినార్‌కు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యాపకురాలు ఫమీదా బేగం ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వీవీఎస్ కుమార్ తెలిపారు. అమెరికాలో జరుగుతున్న 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో పత్ర సమర్పణ చేయడానికి ఆమెకు అవకాశం వచ్చిందని తెలిపారు. దోహాఖతర్, ఆంధ్ర కళావేదిక దోహాఖతర్, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ఆధ్వర్యంలో అధ్యాపకురాలికి గౌరవ దక్కడం అభినందనీయమని క్లస్టర్ వర్సిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్ తెలిపారు.

పులి కూనల్లా పిల్లి పిల్లలు

పరిశీలించిన అటవీ శాఖ అధికారులు



జంగంపిల్లి కూనలు

కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పరిసరాల్లో పులి కూనల్లా కనిపిస్తున్న పిల్లి పిల్లలను రైతులు గమనించారు. చివరకు అవి జంగం పిల్లి పిల్లలని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. మండల కేంద్రం నుంచి హరిహరం వెళ్లే రహదారిలో గోవిందు అనే రైతు పొలంలో నాలుగు కూనలు రైతులకు బుధవారం కంట పడ్డాయి. అటువైపు వెళ్తున్న రైతులు గమనించి అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. దీంతో అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అవి పులి కూనలు కావని, జంగంపిల్లి పిల్లలేనని ఎఫ్ఎస్‌వో జ్యోతి స్వరూప్ తెలిపారు. సాయంత్రం వరకు అటవీ శాఖ సిబ్బందిని భద్రంగా ఉంచామని, తల్లి తన పిల్లలను తీసుకెళ్లిందని చెప్పారు.

ఆత్మకూరు పోలీసులకు మంత్రి లోకేశ్ అభినందన

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బావిలో పడిన వృద్ధురాలిని కాపాడిన ఆత్మకూరు పోలీసులను మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదిక ద్వారా బుధవారం అభినందించారు. ఈ నెల 18న ఆత్మకూరు మండలంలోని ముష్టేపల్లి గ్రామానికి చెందిన ఖాదరమ్మ అనే వృద్ధురాలు పంట పొలాల్లోని బావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. ఆమె కేకలు విని ఆ పక్కనే రహదారిపై వెళ్తున్న ఆత్మకూరు పోలీసు స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ మౌలాలి, హోంగార్డు చక్రపాణి వృద్ధురాలిని కాపాడురు. కలెక్టర్ ఆదిరాజ్‌సింగ్ రాణా ఈ ఇద్దరు పోలీసులను అభినందించారు. ఈ విషయం మీడియా, సోషల్ మీడియా ద్వారా మంత్రి నారాలోకేష్ దృష్టికి వెళ్లింది. పోలీసుల సాహసోపేతమైన ప్రయత్నాన్ని బుధవారం ఎక్స్ వేదిక ద్వారా అభినందించారు.



ఎక్స్ వేదిక ద్వారా ఆత్మకూరు పోలీసులను అభినందించిన నారా లోకేష్

వివాదాల ఆలూరు

(5వ పేజీ తరువాయి)

సీఐ, ఎస్సై మధ్య విభేదాలకు ఆజ్యం పోసిన చిన్న బాస్‌లు

ఆలూరు పోలీసు స్టేషన్‌లో సీఐ శ్రీనివాస నాయక్, ఎస్సై వెంకట నరసింహులు మధ్య విభేదాలు ఏర్పడటానికి అందులో ఉన్న సీనియర్ కానిస్టేబుల్ ఒకరు, మరో చిన్న బాసులే కారణమని పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎస్సైను వీఆర్‌కు పంపుతూ ఆయన స్థానంలో సత్య సాయి జిల్లాలో వీఆర్‌లో ఉన్న దిలీప్ కుమార్‌ను నియమిస్తూ ఈ నెల 12నా డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ ఇద్దరు సిబ్బంది సంబరాలు చేసుకున్నట్లు సమాచారం.

ఎస్సై వీఆర్‌ను నిలుపుదల చేసేందుకు అన్ని వర్గాల యత్నాలు

'విధుల్లో చేరి మూడు నెలలు కూడా పూర్తి కాలేదు.. అన్ని వర్గాలు, అధికారులకు పని చేశాను, ఏం తప్పు చేశానని వీఆర్‌కు పంపించారు.. మీరే సహాయం చేయండి' అంటూ సదరు ఎస్సై



వీఆర్‌లోకి వెళ్లిన సీఐ శ్రీనివాస్ నాయక్



వీఆర్‌లోకి వెళ్లిన ఎస్సై నరసింహులు

అధికార పార్టీలోని ముఖ్యనేతల ఎదుట వాపోయినట్లు తెలిసింది. దీంతో రంగంలోకి దిగిన ఓ ఎమ్మెల్యే ఇద్దరు అధికార పార్టీ ముఖ్య నేతలు ఉన్నతాధికారులతో ఎస్సైను బదిలీ చెయ్యొద్దని కోరగా ఉన్నత అధికారులు ససేమీరా అన్నట్లు తెలిసింది. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సీఐ వెంకట చలపతి, ఎస్సై దిలీప్ కుమార్‌లు ఎన్ని రోజులు కొనసాగుతారో చూడాలి. అధికారుల మధ్య విభేదాలు సృష్టిస్తున్న ఆ ఇద్దరు సిబ్బందిపై కూడా ఇంటెలిజెన్స్ నివేదికలు జిల్లా ఉన్నత అధికారులకు వెళ్లాయి. వారిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉందని పోలీసు వర్గాల సమాచారం.

గోడు వినండి..!

(5వ పేజీ తరువాయి)



తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) సీసీ లైనింగ్ పనులు (ఫైల్)

తుంగభద్ర బోర్డుకు ఏపీ ప్రభుత్వం ఓటాన్ అకౌంట్‌లో కేటాయించిన నిధులు ఈ నెల 30వ తేదీలోగా వినియోగించుకోవాలని 11వ తేదీన సర్క్యులర్ మెమో నంబరు.ఎఫ్ఐఎన్02-15069/11/2924-ఇ-ఎస్ఈసీ-డీటీఏలో స్పష్టంగా పేర్కొన్నారు. సీఎఫ్ఎంఎస్ బడ్జెట్ ఆర్డర్ నంబరు.4400014207, 55500014351లో కేటాయింపులు చేసిన నిధులు 2024-25కు సంబంధించి 2వ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రకారం ఆగస్టు 1 నుంచి నవంబరు 30వ తేది వరకే ఉంటుంది. అంటే ఆయా హెడ్ ఆఫ్ అకౌంట్స్ కింద అందుబాటులో ఉన్న బడ్జెట్‌ను ఈ నెల 30వ తేదీలోగా వినియోగించుకోవాలి. లేని పక్షంలో బడ్జెట్ వెనక్కి వెళ్తుందని అంటున్నారు. బోర్డు అకౌంట్‌ను ఫ్రీజ్ చేయడంతో ఆ నిధులు ఎలా వినియోగించుకోవాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కర్ణాటక ప్రభుత్వానికి లేఖ రాసి బోర్డు అకౌంట్ ఫ్రీజ్ తొలగించాలని, బోర్డు ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని తుంగభద్ర బోర్డు వర్క్ చార్జ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి టీకే గోపాల్‌కృష్ణ విన్నవిస్తున్నారు. మరో పక్క బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ కాంట్రాక్టర్ సహా మరో మరికొందరితో పెండింగ్ బిల్లులు చెల్లింపు, అగ్రిమెంట్ చేసిన రూ.400 కోట్లు టెండర్లు రద్దు చేయకుండా కొనసాగించేలా అనంతపురం జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులతో చర్చలు జరిపినట్లు సమాచారం.

హాస్టల్ విద్యార్థులకూ ఫేస్ రికగ్నేషన్

- జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్ కింద 3 హాస్టళ్ల ఎంపిక
- ఇక బోగస్ అటెండెన్స్‌కు చెక్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఫేస్ రికగ్నేషన్ (ఎఫ్ఆర్ఎస్)పద్ధతిని అమలులోకి తెచ్చేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇందులో భాగంగానే తొలిదశలో ప్రయోగాత్మకంగా జిల్లాలో మూడు హాస్టళ్లను ఎంపిక చేసింది. ఆదోని పోస్ట్ మెట్రిక్ కళాశాల హాస్టల్, వెల్దుర్తి, కర్నూలు బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. జిల్లా బీసీ సంక్షేమ అధికారులు ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకొని సర్వీస్ ప్రొవైడర్‌కు అప్పగించనుంది. ఎఫ్ఆర్ఎస్ అమలు కోసం ప్రత్యేకంగా యాప్‌ను ఆయా వసతి గృహాలకు చెందిన హాస్టల్ సంక్షేమ అధికారికి అప్పగించనున్నారు. ఎంపిక చేసిన ప్రతి హాస్టల్‌కు చెందిన విద్యార్థుల ఫొటోలు తీసి, ఆధార్, ఫోన్ నంబర్, చిరునామా తరగతి తదితర వివరాలను యాప్‌లో అప్లోడ్ చేస్తారు. తద్వారా యాప్ ఉన్న మొబైల్ ఫోన్, పరికరాలోనూ విద్యార్థి ముఖం చూపిస్తే హాజరు నమోదవుతుంది. ఉదయం ప్రార్థన, సాయంత్రం స్కూల్ సమయం తర్వాత ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేస్తారు. దీని ద్వారా ఏ వసతి గృహంలో ఏ రోజు ఎంత మంది విద్యార్థులు ఉన్నదీ తెలుస్తుంది. ఈ విధానం వలన హాస్టళ్లలో బోగస్ హాజరుకు చెక్ పడుతుంది. బోగస్ హాజరు చూపి బిల్లులు డ్రా చేసుకొని ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసేందుకు వీలుండదు.



వార్డెన్ల గుండెల్లో దడ..

బీసీ వసతి గృహాల్లో ఎఫ్ఆర్ఎస్ అమలవుతుండడంతో వార్డెన్ల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తమ అవినీతికి చెక్ పడుతుందని ఈ విధానాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర స్థాయిలో కొంత మంది వార్డెన్లు పై స్థాయి అధికారుల ద్వారా చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది.

జిల్లాల్లో మూడు హాస్టళ్లు ఎంపిక




జిల్లాలోని కర్నూలు, వెల్దుర్తి, ఆదోని వసతి గృహాల్లో ఫేస్ రికగ్నేషన్ విధానం అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. డిసెంబరు నెల నుంచి ఇది అమలు చేయాలని రాష్ట్రస్థాయి అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం.

-వెంకటలక్ష్మమ్మ, బీసీ వెల్ఫేర్ సాధికారత జిల్లా అధికారి

జీడీపీ నీరు విడుదలయ్యేనా?

- రబీ సాగు కోసం ఎదురుచూస్తున్న ఆయకట్టు రైతులు
- సాగుకు సిద్ధంగా 13 వేల ఎకరాలు
- కలెక్టర్ దగ్గర ఇరిగేషన్ ఎస్ఈ లెటర్



గాజులదిన్నె ప్రాజెక్టులో నిలువ ఉన్న నీరు

గోనెగండ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులైనా ఇంత వరకు గాజులదిన్నె ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు భూములకు సాగునీరు విడుదల కాలేదు. రైతులు పంట భూములను సాగుకు సిద్ధం చేసుకొని నీరు విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు కింద 25వేల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా ఈ రబీలో 13వేల ఎకరాల వరకు సాగు చేయడానికి రైతులు సిద్ధమయ్యారు. అయితే అధికారులు నీరు ఎప్పుడు విడుదల చేసేది తెలియక ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే అందిన సమాచారం మేరకు ఇప్పటి వరకు ఐఏబీ సమావేశం జరగక పోవడంతో నీటి విడుదల ఎప్పుడు ఎన్ని వేల ఎకరాలకు సాగు నీరు విడుదల చేయాలనే విషయంపై స్పష్టత రాలేదు. ఇప్పట్లో ఐఏబీ సమావేశం జరిగే సూచనలు కనిపించకపోవడంతో రెండు రోజుల క్రితం ఇరిగేషన్ ఎస్సీ గాజులదిన్నె ప్రాజెక్టుకు రబీ సీజన్‌లో నీటి విడుదల కోసం అనుమతి కోరుతూ కలెక్టర్‌కు ఒక లెటర్ తయారు చేసి పంపినట్లు విశ్వసనీయ సమాచారం. దాన్ని కలెక్టర్ పరిశీలించి నీటి విడుదలకు అనుమతి ఇవ్వవలసి ఉంది. ఈ నెల ఆఖరులోపు నీరు విడుదల చేయవచ్చని అనాధికారిక సమాచారం.



గాజులదిన్నె ప్రాజెక్టు కింద సాగుకు సిద్ధం చేసుకున్న ఆయకట్టు భూమి

కర్నూలులో హైకోర్టు బెంచ్..!

(5 పేజీ తరువాయి)

ఐదేళ్లు మభ్యపెట్టిన వైసీపీ..

శ్రీబాగ్ ఒడంబడిక అమలు చేయాలి.. కర్నూలులో హైకోర్టు ఏర్పాటు డిమాండ్‌తో 2018 నవంబరు 16న రాయలసీమ ప్రజా సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో సీమ ప్రజా సంఘాల సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు, విద్యార్థులతోపాటు ప్రజా సంఘాలు వివిధ రూపాల్లో పోరాటాలకు సై అన్నాయి. ఆ సమయంలో కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని అనాటి సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లోనూ ఇదే హామీ ఇచ్చారు. అయితే అప్పట్లో టీడీపీ ఓడిపోయి వైసీపీ అధికారంలోకి వచ్చింది. జగన్ సీఎం బాధ్యతలు చేపట్టాక మూడు రాజధానులు పేరిట మాయ చేశారు. కర్నూలు న్యాయ రాజధాని, హైకోర్టు ఏర్పాటు చేస్తామంటూ సీమ ప్రజలను ఐదేళ్లు మభ్యపెట్టారు. జిల్లాకు చెందిన నాటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జగన్నాథగట్టుపై చుట్టూ 25 కిలోమీటర్లు అందంగా కనిపించే హైకోర్టు భవనం నిర్మిస్తామని ఎస్టీబీసీ కాలేజీ వేదికగా జరిగిన సీమ గర్జన సభలో గర్జించారే తప్పా అచరణలో పెట్టలేదు. గత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం సభలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామనే హామీకి టీడీపీ కట్టుబడి ఉంది. తమ కూటమి ప్రభుత్వం రాగానే బెంచ్ ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు అదే హామీని ప్రజల్లోకి తీసుకెళ్లారు.



కర్నూలు నగరంలోని జిల్లా కోర్టు

బెంచ్ ఏర్పాటుకు అడుగులు.. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ

ప్రజాగళం సందర్భంగా 'కర్నూలులో హైకోర్టు బెంచ్' ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. న్యాయ సమీక్షలో కర్నూలులో బెంచ్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలి కోరుతూ లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీ అక్టోబరు 28న హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ఆవశ్యకతను స్పష్టంగా ఆ లేఖలో వివరించారు. ఇది ప్రజల డిమాండ్. ప్రజాగళంలో స్పష్టమైన హామీ ఇచ్చారు. 1952లో కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది.. ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తరువాత రాజధాని హైదరాబాద్‌కు రాజధాని వెళ్లింది. 2014లో రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ తర్వాత రాజధాని, హైకోర్టు అమరావతికి మార్చారు. దేశంలో పలు రాష్ట్రాల్లో హైకోర్టులు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. బెంచ్ ఏర్పాటు కోసం ప్రధాన న్యాయమూర్తి, ప్రభుత్వం కలిసి అంగీకరించాల్సి ఉంది. రాయలసీమ ప్రాంతం 2022లో జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత 8 జిల్లాలుగా ఉన్నాయి. రాష్ట్ర జనాభాలో 25 శాతం 1.59 కోట్లు. వైశాల్యంలో 43 శాతం రాయలసీమ జిల్లాలే ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి అమరావతిలోని హైకోర్టుకు వెళ్లడం సామాన్యులకు కష్టంగా ఉంది. కర్నూలు నుంచి విజయవాడకు రైలు రవాణా సౌకర్యం కూడా లేదు. రాయలసీమ ప్రాంతానికి కర్నూలు కేంద్రం కావడంతో అక్కడ హైకోర్టు బెంచ్ ఏర్పాటు అవసరం ఉందని ఆ లేఖలో ప్రభుత్వం పేర్కొంది. అదే క్రమంలో బెంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రివర్గ సమావేశంలో కూడా తీర్మానం చేశారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసి తీరుతాం



శ్రీబాగ్ ఒడంబడిక అమలులో సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో ఉన్నారు. హైకోర్టు బెంచ్‌తో పాటు కృష్ణా జలాలు వినియోగంలోనూ టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. వైసీపీ ప్రభుత్వం లాగా మాటలతో మాయ చేయడం చంద్రబాబుకు రాదు. బెంచ్‌పై ఇప్పటికే హైకోర్టుకు లేఖ రాశాం.. మంత్రివర్గం సమావేశంలో తీర్మానం కూడా చేశాం. లోకాయుక్త, ఏపీ మానవ హక్కుల కమిషన్‌లు కర్నూలులోనే ఉంటాయని మంత్రివర్గంలో సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారు.

- టీజీ భరత్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి

హైకోర్టు బెంచ్ పట్ల హర్షం

- సీఎం ఫ్లెక్సీకి న్యాయవాదుల క్షీరాభిషేకం

కర్నూలు లీగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించడం పట్ల కర్నూలు న్యాయవా దులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీడీపీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో, యువగళం సందర్భంగా నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు రాష్ట్ర క్యాబినెట్ బుధవారం అంగీకరించింది. దీంతో న్యాయవాదులు సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి క్షీరాభి షేకం చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు సాధన జేఏసీ కన్వీనర్ వై.జయరాజు మాట్లాడుతూ హైకోర్టు బెంచ్‌ను సాధ్యమైనంత తొందరలో ఏర్పాటు చేయాలని కోరారు. కర్నూలులో ఉన్న మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్స్‌ను కర్నూలులోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి టీఎస్ రవికాంత్ ప్రసాద్, బీజేపీ లీగల్ సెల్ నాయకుడు మోహన్ ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం ప్రకటించారు.



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ లీగల్ సెల్ నాయకుడు మోహన్

పోలీసు అదుపులో మట్కా డాన్..!

ఆదోని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలో గుట్టుచప్పుడు కాకుండా మట్కా కార్యకలాపాలను నిర్వహిస్తున్న మట్కా డాన్‌ను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిసింది. ఆలూరు మండలం కమ్మరచేడు స్వగ్రామం కాగా బళ్లారిలో స్థిర నివాసం ఉంటున్నాడు. అక్కడి నుంచే మట్కా కార్యకలాపాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆదోనిలో తన తమ్ముడి సహకారంతో ఈ వ్యవహారం నడుపుతున్నాడు. ఆదోని త్రీ టౌన్ పోలీసులు పక్కా సమాచారంతో వల పన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై త్రీ టౌన్ సీఐ రామలింగమయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పూర్తిస్థాయి విచారణ తర్వాత బయటకు చెప్పగలమని తెలిపారు.

ఆకతాయికి జైలు శిక్ష

బండిఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన పెద్దిరాజు అనే ఆకతాయికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో వారం రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. బుధవారం గ్రామంలో అల్లరికి పాల్పడిన పెద్దిరాజును కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి శిక్ష విధించారన్నారు

ఆరేకల్లులో చైన్‌స్నాచింగ్

ఆదోని రూరల్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం ఆరేకల్లులో చైన్ స్నాచింగ్ జరిగింది. ఓ లెక్చ రర్ మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును తెంచుకొని దొంగలు పరార య్యారు. ఆదోని పట్టణం హనుమాన్ నగర్‌లోని నీలకం ఠేశ్వర స్వామి దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న పార్వతి ఆరేక ల్లులోని ములుగుందం రహదారిలో ఉన్న గురుకుల బాలికల పాఠశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు కాలేజీ బయ టకు రాగానే ద్విచక్ర వాహనం మీద వచ్చిన దంపతులు లెక్చరర్ పార్వతి మెడలో ఉన్న గొలుసును తెంచుకెళ్లారు. దొంగల ప్రతిఘటనలో పార్వతి మెడకు గాయమైంది. బాధితురాలు తాలుక పోలీ సులను సంప్రదించింది. సీసీ ఫుటేజీల ద్వారా దొంగలను గుర్తిస్తు న్నామని, విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

కొలనుభారతి పురోహితునికి నోటీసు




పురోహితునికి నోటీసులు ఇస్తున్న ఈవో

కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భక్తుల మనోభావాలను దెబ్బతినే విధంగా ప్రవర్తించిన కొలనుభారతి ఆలయ పురోహితులు చక్రపాణి శర్మకు ఈవో రామలింగారెడ్డి బుధవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 16న తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్ మండలానికి చెందిన కొంత మంది భక్తులు కొలనుభారతి అమ్మవారి దర్శనం వచ్చారు. ఆ సమయంలో వారి పట్ల పురోహితులు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా కొంత నగదు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈవో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. పురోహితుడు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో నోటీసులు జారీ చేసినట్లు ఈవో పేర్కొన్నారు. వీటిపై పది రోజుల్లో సంజాయిషీ కోరినట్లు ఈవో చెప్పారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం : రామలింగారెడ్డి, ఈవో

ఈ నెల 25వ తేదీన కొలనుభారతి క్షేత్రంతో పాటు సప్తశివాలయాల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం. పురోహితులు, సిబ్బంది సమయపాలన పాటించేవిధంగా ఎవరు ఏయే సమయంలో వస్తున్నారనే వాటిపై కూడా బయోమెట్రిక్ ఏర్పాటు చేస్తున్నాం. అంతేగాకుండా ఆలయాన్ని ఎన్ని గంటలకు తెరవాలి, ఏ సమయంలో మూసివేయాలనే వాటిపై కూడా పరిశీలిస్తున్నాం.

తుగ్గలి నాగేంద్రకు గన్‌మెన్ల కేటాయింపు



గన్‌మెన్‌తో తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్రకు ప్రభుత్వం గన్‌మెన్లను మంజూరు చేసింది. ఫ్యాక్షన్ నేపథ్యం నాయకుడు కావడంతో ఆయనకు రక్షణగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ సందర్భంగా తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ తనకు ప్రాణహాని ఉందని గుర్తించిన ప్రభుత్వం గన్‌మెన్లను మంజూరు చేసిందని చెప్పారు. అందుకు రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేశ్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తామని చెప్పారు.

బాబోయ్ దొంగలు..!

- రెండేళ్లుగా పని చేయని సీసీ కెమెరాలు
- పంట ఉత్పత్తులను కాపాడుకోవడానికి రైతుల అవస్థలు



వారం కిందట దొంగిలించిన ఉల్లిగడ్డల బస్తాలు

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో గిట్టుబాటు ధర లభిస్తుందనే నమ్మకంతో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా రైతులు పంట ఉత్పత్తులను విక్రయానికి తీసుకు వస్తున్నారు. అయితే.. కొంత మంది కేటుగాళ్లు పంట ఉత్పత్తులను ఎత్తుకెళ్తుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. రాత్రిపూట దొంగలు యార్డులో చొరబడి ఉల్లిగడ్డలు, వాము, తదితర వాటిని తీసుకెళ్తున్నారు. దొంగలను అదుపు చేయడంలో మార్కెట్ యార్డు అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం చూపుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో యార్డులో 73 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే.. ఈ సీసీ కెమెరాలను సక్రమంగా పని చేయడం లేదు. 73 సీసీ కెమెరాలకు గాను 40 సీసీ కెమెరాలే యార్డులో కనిపిస్తున్నాయి. కనీసం ఉన్న సీసీ కెమెరాలనైనా యుద్ధ ప్రాతిపదికన రిపేరు చేయించి తమ పంట ఉత్పత్తులను దొంగల బారి నుంచి కాపాడాలని రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తాం

గతంలో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులకు భద్రత ఉండేది. ఇటీవల దొంగల బెడద ఎక్కువైంది. రాత్రిపూట ఉల్లిగడ్డలతో పాటు తదితర పంట ఉత్పత్తులను కేటుగాళ్లు ఎత్తుకెళ్లిపోతున్నారు. రెండేళ్లుగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. 73 సీసీ కెమెరాలకు గాను 40 మాత్రమే ఉన్నాయి. వాటిని యుద్ధ ప్రాతిపదికన రిపేరి చేయించి పంట ఉత్పత్తులకు భద్రత కల్పిస్తాం. అదే విధంగా ఫోర్త్ టౌన్ పోలీసులు రాత్రి పూట యార్డులో తనిఖీకి వచ్చేలా చూడాలని పోలీసు అధికారులను కోరాం.

- జయలక్ష్మి, మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

ఎండు మిర్చి ధర పైపైకి..

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఎండు మిర్చి ధర ఆకాశాన్నంటుతోంది. వారం రోజులుగా రైతులు ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున అమ్మకానికి తీసుకు వస్తున్నారు. బుధవారం క్వింటా ఎండు మిర్చి ధర గరిష్ఠంగా 15,513, మధ్యస్థ ధర రూ.6,709, కనిష్ఠ ధర రూ.1,699కు రైతులకు లభించిందని మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. ఆదేవిధంగా మినుములకు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధరలు క్వింటానికి రూ.8,321 రైతులకు అందిందని తెలిపారు. సజ్జకు గరిష్ఠ, మధ్యస్థంగా రూ.2,169, కనిష్ఠంగా రూ.2,091 లభించిందని. కొర్రలకు గరిష్ఠ ధర రూ.3,309, మధ్యస్థం రూ.2,511, కనిష్ఠం రూ.2,449 రైతులకు నిర్ణయించారని సెక్రటరీ తెలిపారు. వేరుశనగ కాయలకు గరిష్ఠ ధర రూ.6,189, మధ్యస్థ రూ.5,410, కనిష్ఠ ధర రూ.3,610 దక్కింది. ఆముదాలకు గరిష్ఠం రూ.5,706, మధ్యస్థ రూ.5,686, కనిష్ఠం రూ.5,190 నిర్ణయించారు. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,246లు, మధ్యస్థం రూ.2,159లు, కనిష్ఠం రూ.2,125లు దక్కింది. శనగలకు గరిష్ఠ, మధ్యస్థ, కనిష్ఠ ధర రూ.6,031 కాగా, ఉల్లి ధర వారం రోజులుగా తగ్గుతూ వస్తోంది. గరిష్ఠ ధర రూ.4,412, మధ్యస్థం రూ.3,891, కనిష్ఠం రూ.515 దక్కింది.



యార్డుకు అమ్మకానికి వచ్చిన ఎండుమిర్చి

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆదోని, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : టీ తాగేందుకని ఇంట్లోంచి బయటకు వెళ్లిన వ్యక్తి ఇక తిరిగి రాలేదు. తెల్లారి చేసేసరికి మురికి కాలువలో శవమయ్యాడు. ఆదోని పట్టణంలోని కౌడలపేటకు చెందిన మహమ్మద్ గౌస్(28) బుధవారం తెల్లవారు జామున 4గంటల సమయంలో టీ తాగేందుకు ఇంటి నుంచి బయటకొ చ్చాడు. తెల్లారేసరికి మురుగు కాలువలో శవమైతేలాడు. కాలువ పైన కత్తి ఉండడం, మృతుడి గొంతుపై కత్తి గాటు ఉండటం పోలీసులు గమనించారు. ఇది హత్యనా, ఆత్మహత్యనా? అన్నది విచారణలో తేలాల్సి ఉంది. సెంట్రింగ్ పని చేస్తున్న సయ్యద్ మహమ్మద్ గౌస్ మూడు నెలలుగా పనికి పోకుండా ఇంట్లోనే ఉంటున్నాడని, అతని మానసిక పరిస్థితి కూడా సరిగాలేదని, ఇంటి నుంచి కత్తి తెచ్చుకొని ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని సీఐ రామలింగమయ్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి సహేరాబాను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

గ్రంథాలయాల ఆధునికీకరణకు సహకారం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



బహుమతులు అందుకున్న విద్యార్థులతో టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల ఆధునికీకరణకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా టీజీ వెంకటేశ్, కేవీఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి పుష్పమాల వేసి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ యువత వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో పెట్టాలని అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో స్టడీ ల్యాబ్‌లో ఏసీతోపాటే అన్ని రకాల పుస్తకాలు అందజేస్తూ తగిన సౌకర్యాలు కల్పిస్తానని చెప్పారు. వారం రోజులుగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, కేసీ కల్కూర, సాహితీ సదస్సు సంస్థ కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ, విశ్రాంత ఇంజినీర్ ముచ్చుకోట చంద్రశేఖర్, నిఖిలేశ్ ఎడ్యుకేషన్ అకాడమీ అధ్యక్షుడు టి. మద్దులేటి, డిప్యూటీ లైబ్రేరియన్ వి. పెద్దక్క, లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు రైతుల ఆత్మహత్య



వెంకటేశ్వర్లు(ఫైల్)



నూర్‌బాషా(ఫైల్)

సి.బెళగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక కర్నూలు జిల్లాలోని వేర్వేరు మండలాల్లో బుధవారం ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. సి.బెళగల్ మండలం చింతమానుపల్లె గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు (56) పురుగుల మందు తాగి బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వర్లు తు తనకున్న 2 ఎకరాలతోపాటు మరొక 8 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, ఉల్లి, మిరప, ఆముదం, వేరుశెనగ పంటలను సాగు చేస్తున్నాడు. గత 5 సంవత్సరాలుగా పంటలు చేతికి రాక అప్పులపాలయ్యాడు. బుధవారం పొలానికి వెళ్లి పత్తి పంటకు పిచికారి చేయడానికి తెచ్చుకున్న పురుగుల మందుతాగి పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టు పక్కల పొలాల వారు చూసి కుటుంబసభ్యులకు తెలియజేశారు. అప్పులు రూ 15 లక్షలు ఉంటాయని, తిరిగి చెల్లించలేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడు వెంకటేశ్వర్లుకు భార్య గిడ్డమ్మ, నలుగురు కూతుర్లు, ఒక్క కుమారుడు ఉన్నారు.

ఓర్వకల్లు: అప్పుల బాధ తాళలేక కాల్వ గ్రామంలో యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన తాతేగాల్ల నూర్‌బాషా(30) ఏడేళ్లుగా గ్రామంలో ఇతర రైతుల కొబ్బరి చెట్లను కౌలుకు తీసుకొని కొబ్బరి బోండాలను కర్నూలు నగరంలోని పలు అంగళ్లకు విక్రయించేవాడు. పది ఎకరాల భూములు కౌలుకు తీసుకొని వివిధ రకాల పంటలు సాగుచేసేవాడు. సుమారు రూ.15 లక్షల అప్పు చేశాడు. అయితే మూడేళ్ల నుంచి కొబ్బరి బోండాల వ్యాపారంలో నష్టాలు వచ్చాయి. పంట దిగుబడులు రాక, గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయంలో తీవ్రంగా నష్టపోయాడు. అప్పులు తీర్చలేనేమోనని మనస్తాపానికి గురైన నూర్‌బాషా మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా కోలుకోలేక బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతునికి భార్య ఖాజాబన్ని, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్‌కుమార్ తెలిపారు.

అటవీశాఖ దోపిడీ

- రుద్రకోటేశ్వరానికి వెళ్లే భక్తులపై మళ్లీ అటవీశాఖ ఆంక్షలు
- నాలుగు చక్రాల వాహనానికి రూ.300 వసూలు
- మండిపడుతున్న హిందూ ధార్మిక సంఘాలు

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారులు మల్లన్న భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి రాకపోకలు జరపాలంటే ఇప్పటికే నాలుగు చోట్ల అటవీ చెక్‌పోస్టుల వద్ద పర్యావరణ రుసుమును వసూలు చేస్తున్నారు. అయితే రుద్రకోటేశ్వర క్షేత్రానికి వెళ్లే భక్తుల నుంచి కూడా వసూలు చేస్తుండడంతో వారు మండిపడుతున్నారు. నల్లమలలో అత్యంత ప్రాశస్త్యం కలిగిన రుద్ర కోటేశ్వర క్షేత్రానికి భక్తులు ఎన్నో ఏళ్లుగా వెళ్తున్నారు. అయితే కార్తీక మాసం ప్రారంభం నుంచి అటవీ అధికారులు కొత్త నిబంధనలు విధించడంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు.



రుద్రకోటేశ్వరానికి వెళ్లే దారిలో ఉన్న చెక్‌పోస్టు ఇదే (ఫైల్)

శివయ్యను దర్శించుకోవాలంటే.. శిస్తు చెల్లించాల్సిందే

నల్లమలలోని రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లాలంటే ఫోర్‌వీలర్ వాహనానికి పర్యావరణ రుసుము పేరిట అటవీ అధికారులు రూ.300 వసూళ్లు చేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా ఇదే తరహాలో వసూళ్లు చేయడంతో అప్పట్లో హిందూ ధార్మిక సంఘాలు, శివస్వాములు ఆత్మకూరులోని అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసనలు వ్యక్తం చేయడంతో అటవీ అధికారులు వెనక్కి తగ్గారు. అయితే తాజాగా కార్తీక మాసం ప్రారంభం నుంచి మళ్లీ ఫోర్ వీలర్ వాహనాల నుంచి రూ.300 వసూళ్లు చేయడంతో హిందూ ధార్మిక సంఘాలతో పాటు రుద్రకోటేశ్వరస్వామి భక్తులు మండిపడుతున్నారు.

పర్యావరణ రుసుమును సక్రమంగా వినియోగిస్తున్నారా..?

ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి వెళ్లాలంటే మార్గమధ్యంలో బైర్లూటి, కొత్తప్రోలు, శిఖరం, దోర్నాల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి అటవీశాఖ పర్యావరణ రుసుము వసూళ్లు చేస్తోంది. ఒక్కో చెక్‌పోస్టు వద్ద ప్రతిరోజు రూ.30వేల నుంచి రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఇవికావని అటవీ మార్గంలో 30కిమీలకు వేగంగా వెళ్లినా, వాహనాలు నిలిపినా, కోతులకు ఆహారం అందించినా రుసుమును వసూళ్లు చేస్తున్నారు. అయితే ఈవిధంగా వచ్చిన సొమ్మును కేవలం ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి వెళ్లే రహదారిలో వన్యప్రాణులకు విఘాతం కలకుండా ఉండే చర్యలు మాత్రమే జరుగుతున్నాయా..? అన్నది ప్రశ్నార్థకమే. ఆమార్గంలో పర్యావరణ రుసుము పేరుతో వచ్చే ఆదాయాన్ని డివిజన్ పరిధిలోని నల్లమల అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ఖర్చు చేయాల్సి వుంటుంది. ఇందులో భాగంగానే రుద్రకోడూరు క్షేత్ర పరిధిలో అడవులను, వన్యప్రాణులను సంరక్షించాల్సి వుంది. అయితే వాటితో సంబంధం లేకుండా రుద్రకోడూరుకు వెళ్లే భక్తుల నుంచి ప్రత్యేకంగా రూ.300 వసూళ్లు చేయడం ఏమిటని భక్తులు మండిపడుతున్నారు.

అటవీ నిబంధనల పేరిట ఆంక్షలు

నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో రుద్రకోటేశ్వర క్షేత్రం ఉంది. ఈక్షేత్రానికి ముఖ్యమైన పర్వదినాలు, కార్తీక, మాఘమాసాలతో పాటు సాధారణ రోజుల్లో ఆది, సోమవారాల్లో వెళ్లేందుకు మాత్రమే అటవీ అధికారులు అనుమతించేవారు. ఇప్పటివరకు క్షేత్రానికి వెళ్లే భక్తులకు వన్యప్రాణుల నుంచి ఎటువంటి అపాయం తలెత్తలేదు. అదేక్రమంలో రుద్రకోటేశ్వర క్షేత్ర నిర్వాహకులు కూడా పర్యావరణ నిబంధనలను అనుసరిస్తూ ముందుకెళ్తున్నారు. అయినప్పటికీ ఆంక్షల పేరిట అటవీ అధికారులు వేధించడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. నల్లమలను ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ప్రకటించడం, వన్యప్రాణుల సంరక్షణ కోసమే తాము కఠినంగా నిబంధనలు అమలుచేస్తున్నామని అటవీ అధికారులు చెబుతున్నప్పటికీ ఆదాయ మార్గాలపై దృష్టి సారించడం విమర్శలకు తావిస్తోంది. వన్యప్రాణులకు, అడవికి విఘాతం కలిగించకుండా ఉండేందుకు భక్తులకు అవగాహన కల్పించాలే తప్ప డబ్బు వసూళ్లు చేయడం ఏంటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది.





రూ.300 వసూళ్లు చేసిన రశీదు



గతంలో అటవీశాఖ ఆంక్షలపై ఆత్మకూరులో నిరసన తెలిపిన శివస్వాములు(ఫైల్)

భక్తులపై ఆర్థిక భారం సరికాదు



రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లే భక్తుల నుంచి డబ్బు వసూళ్లు చేయాలని నిర్ణయించడం సరికాదు. ఎక్కడో అటవీ ప్రాంతంలో ఉండే ఆలయాలను సందర్శించేందుకు భక్తులకు వ్యయప్రయాసలు తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో అటవీశాఖ కొత్తగా రుసుములను తీసుకురావడం భక్తుల మనోభావాలను కించపరిచినట్లే. అడవుల రక్షణ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలే తప్ప ప్రతి సమస్యకు పరిష్కారం భక్తుల నుంచి వసూళ్లు చేయాలని ఆలోచించడం విడ్డూరంగా వుంది. సనాతన ధర్మం గురించి పోరాడే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆలయాలకు వెళ్లే భక్తులపై తరుచూ ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న అటవీశాఖ విధానాలపై స్పందించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

– గరుడాద్రి సుదర్శన్, వీహెచ్‌పీ అధ్యక్షుడు, ఆత్మకూరు ప్రఖండ

ఉన్నతాధికారుల నిర్ణయంతోనే రుసుము వసూళ్లు

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే రుద్రకోడూరు క్షేత్రానికి వెళ్లే వాహనాల నుంచి రూ.300 రుసుము వసూళ్లు చేస్తున్నాం. ఈవిధంగా సమకూరిన నిధులతో చెత్తతొలగింపు, అగ్నిమాపక చర్యలు, గడ్డిభూముల అభివృద్ధి, యాత్రికుల సదుపాయాల కల్పన, వ్యూలైన్స్, ఫైర్‌లైన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతోంది. భక్తుల నుంచి వస్తున్న అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల ప్రకారమే ముందుకెళ్తాం.

– కృష్ణప్రసాద్, ఎఫ్ఆర్‌వో, బైర్లూటి రేంజ్

డిసెంబరు 15లోపు పంటల బీమా చెల్లించుకోవాలి

కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల రైతాంగం డిసెంబరు 15లోపు పంటల బీమా చెల్లించుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేష్ తెలిపారు. బుధవారం మండలంలోని నందికుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా మినుము పంటలో పల్లాకు తెగుల నివారణ చర్యలపై ఏవో రైతులకు వివరించారు. తెల్లదోమ నివారణకు జిగురు పూసిన పసుపు రంగు అట్టలను పొలంలో 20 నుంచి 25 వరకు అక్కడక్కడ ఉంచినట్లుయితే.. తెల్లదోమను అరికట్టవచ్చని తెలిపారు. ప్రస్తుతం తెల్లదోమను ఆశిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయా సిబ్బంది శివకృష్ణ, శివ నాయక్, రైతులు పాల్గొన్నారు.

సంగమేశ్వరంలో ఆర్డీవో పూజలు

కొత్తపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం స్వామిని, కొలను భారతి అమ్మవారిని ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. బుధవారం కార్తీక మాసం పురస్కరించుకుని సంగమేశ్వరంలోని ఎగువ ఉమామహేశ్వరస్వామికి అభిషేకాది క్రతువులను పురోహితులు చేయించారు. అలాగే సప్తనది తీరంలో కార్తీకదీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆర్డీవో కొలనుభారతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి పురోహితులు ఆర్డీవోకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆర్డీవో వెంట కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణి, వీఆర్వోలు బాబుమియా, చంద్రశేఖర్ ఉన్నారు.



సంగమేశ్వరంలో పూజలు చేస్తున్న ఆర్డీవో నాగజ్యోతి

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు బాలిక ఎంపిక

పాణ్యం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీ గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలకు చెందిన గిరిజన విద్యార్థిని జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామునాయక్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఈనెల16 నుంచి 18వరకు కాకినాడలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల హాకీ ఎంపిక పోటీలలో రాష్ట్ర జట్టుకు కళాశాల విద్యార్థిని బిలావత్ విజయలక్ష్మి ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరులో రాంచీ పట్టణంలో జరిగే జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ పోటీలలో బాలిక పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా బాలికను ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్, పిడి రణదేవ్, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, ఖేల్ ఇండియా హాకీ కోచ్ అశోక్‌రెడ్డి, కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.



బిలావత్ విజయలక్ష్మిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

ఆకట్టుకున్న పార్మసీ వైజ్ఞానిక ప్రదర్శనలు



వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పార్మసీ వారోత్సవాలలో భాగంగా బుధవారం శాంతిరాం పార్మసీ కళాశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు వివిధ ఆకృతుల ద్వారా పార్మశీ మందుల తయారీ విధానాన్ని, మందుల వినియోగాన్ని, మానవ శరీరంలో అవయవాల పనితీరుపై చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌శెట్టి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో బుధవారం సీఎం చంద్రబాబును శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని అభివృద్ధి అంశాల గురించి సీఎం చంద్రబాబుతో ఆయన చర్చించారు. ప్రత్యేకించి శ్రీశైలం దేవస్థానంలో మాస్టర్ ప్లాన్ అమలు, సిద్ధాపురం ఎత్తిపోతల పథకం, ఆత్మకూరులో నాన్‌అమృత్ వాటర్ స్కీం, వరదరాజ స్వామి ప్రాజెక్ట్ అభివృద్ధి తదితర ప్రధాన సమస్యలతో పాటు నియోజకవర్గంలోని ఆయా మండలాల్లోని ముఖ్యమైన సమస్యలను సీఎం చంద్రబాబుకు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు.



సీఎం చంద్రబాబును కలిసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా

సర్వే రాళ్లపై బొమ్మలను తొలగించాలి

పాణ్యం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : సర్వే రాళ్లపై బొమ్మలను వెంటనే తొలగించాలని జిల్లా భూసర్వే అధికారి జయరాజు ఆదేశించారు. బుధవారం ఆయన సుబ్బరాయుని కొత్తూరు గ్రామంలోని రీసర్వే ఫిర్యాదులను పరిశీలించారు. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదుల్లో పరిష్కారం కాని వాటిని ఎలా పరిష్కరించాలో మండల, సచివాలయ సర్వేయర్లకు అవ గాహన కల్పించారు. సర్వే రాళ్లపైనున్న అక్షరాలు, బొమ్మలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డితో ఫిర్యాదులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్, గ్రామ సర్వేయరు నాగేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి కూటమి కృషి

పాణ్యం, నవంబరు20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి తీవ్ర కృషి చేస్తున్నదని జనసేన పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి చింతా సురేష్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పాణ్యంలో నిర్మాణంలో ఉన్న జనసేన నూతన కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండల జనసేన అధ్యక్షుడు జగదీశ్‌బాబు గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. అటవీ శాఖ అభివృద్ధికి మరింత కృషి చేస్తున్నారన్నారు. ఏపీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తోళ్ల మంజునాథ్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుబ్బకృష్ణ, టీడీపీ నాయకుడు రాంమోహన్‌నాయుడు, శ్రీను, కర్ణ, నారాయణ, ఈశ్వరయ్య, రమణ పాల్గొన్నారు.

మహిళా జాగృతికి న్యాయ సదస్సులు

మిడుతూరు, నవంబరు 20:(ఆంధ్రజ్యోతి): మహిళలు మోసపోకుండా జాగృతం చేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. దివ్య, స్టేట్ ఉమెన్ వెల్‌ఫేర్ కమీషన్ మెంబర్ ఎస్.రుఖియా తెలిపారు. మిడుతూరులోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండలాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రత్యేకించి మహిళల గృహహింస, వరకట్న వేధిపులు, మహిళల అపహరణ, యాసిడ్ దాడులు, మానభంగాలు జరుగకుండా మహిళలు జాగ్రత్తగా ఉండేందుకు న్యాయ విజ్ఞాన సదస్సు ఆవస్యకత అన్నారు. ప్రధానంగా మహిళల చట్టాలను గురించి వారు వివరించారు. మహిళ చైతన్యవంతురాలు అయినప్పుడే కుటుంబం, సమాజం సౌభాగ్యవంతంగా ఉంటుందని వారు అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో దశరథరామయ్య, సీడీపీవో కోటేశ్వరమ్మ, డాక్టర్ తిరుపతి, అడ్వకేట్ రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేణుకా దేవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్. దివ్య

రుద్ర కోటేశ్వరాలయంలో న్యాయాధికారి పూజలు

ఆత్మకూరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మండలం నల్లమల అభయారణ్యంలో వెలసిన రుద్ర కోటేశ్వరాలయాన్ని నంద్యాల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్, ఆత్మకూరు ఇన్‌చార్జి జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆదినారాయణ బుధవారం సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాణిసహిత రుద్రకోటేశ్వర స్వామి అమ్మవార్లకు ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఇదిలా వుంటే దేవస్థానం కమిటీ అధ్యక్షులు రాఘవరావు, ఆలయ పురోహితులు ఆలయ విశిష్టత గురించి జడ్జికి వివరించారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణను ఆలయ కమిటీ వారు ఘనంగా సన్మానించి, స్వామి అమ్మవార్ల చిత్ర పటాన్ని ఆయనకు అందించారు.



శివుడికి అభిషేకం చేస్తున్న జడ్జి

మిరప రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

ఆత్మకూరురూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మిరప సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని ఉద్యానవన అధికారి చందన, ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం పెద్దఅనంతాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు.మిరప పంటకు ఆశించే పురుగులు, తెగుళ్ళ నివారణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు.మిరపలో తామర పురుగు ఆశించడం గమనించామని, వాటి నివారణకు తప్పక యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సెరికల్చర్ అధికారి అరుణ, వీహెచ్ఏ జీవన్, వెటర్నరి అసిస్టెంట్ విజయ లక్ష్మి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీశైలం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహా క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. కార్తీకమాసం పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువ జాము నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడ వీధిలో, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద అధిక సంఖ్యలో దీపారాధనలను చేశారు. సాయంత్రం ఆలయ ధ్వజస్థంభం వద్ద ఆకాశ దీపం కార్యక్రమాన్ని నిర్వహించారు.



దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేస్తున్న దేవస్థానం అధికారి

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన కాట్రగడ్డ సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి రూ. 1,01,116 విరాళాన్ని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందజేశారు. అదేవిధంగా హైదరాబాదుకు చెందిన ఎం విశ్వనాథ్ దంపతులు రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకురాలు టి. హిమబిందుకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

- శ్రీశైలం దేవస్థానంలో బుధవారం లోకకల్యాణార్థం సాక్షిగణపతికి, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష అభిషేక పూజలు నిర్వహించారు. అభిషేకాన్ని పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలాలతో అభిషేకాన్ని చేశారు.

నల్లమలలో లారీ, కారు ఢీ

మహానంది, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం నల్లమల అటవీ ప్రాంతంలోని గిద్దలూరు- నంద్యాల ప్రధాన రహదారిలో బుధవారం కారును లారీ ఢీ కొంది. ఈసంఘటనలో కారులోని కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. నల్లమల లోని చింతమాను మలుపు వద్ద నంద్యాల నుండి గిద్దలూరు వైపు వెళ్తున్న కారును అటువైపు నుంచి వస్తున్న లారీ ఢీ కొంది. ఈసంఘటనలో కారు కూడా పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ సూరిబాబుపై కారు యజమాని పఠాన్ అస్లాంఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

సచివాలయాల తనిఖీ

గడివేముల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయం1, 2లను బుధవారం డీఎల్‌డీవో శివారెడ్డి తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. బయోమెట్రిక్‌ను తనిఖీ చేశారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, ఎంపీసీఐ మ్యాపింగ్‌లపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవగుప్త, ఈవోఆర్డీ మహిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలతో దిగుబడుల అంచనా

నంద్యాల రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) ; పంటకోత ప్రయోగాలతో దిగుబడులను అంచనా వేయవచ్చునని డీఇఎస్‌వో ఓబులేసు పేర్కొన్నారు. బుధవారం నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో వరి పొలంలో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించారు. డీఎస్‌వో మాట్లాడుతూ 25 స్కేయర్ మీటర్ల వరిని రెండుచోట్ల కోతకోసి లెక్కించగా 17.600 కిలోలు, 20.600 కోలోల దిగుబడి వచ్చిందని అన్నారు. ఎకరాకు 38 నుంచి 40 క్వింటాల దిగుబడి రానున్నట్లు అంచనా వేసినట్లు తెలిపారు. మండలంలో వరి కోతలు ఆరంభమైనందువల్ల ప్రతి గ్రామంలో వరి కోత ప్రయోగాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో ప్రహ్లద్, ఏఈవో మణిమోహన్‌రెడ్డి, వీహెచ్ఏ శ్రీనివాస్, వీఆర్‌వో బాలన్న తదితరులు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని నెహ్రూనగర్‌లో బుధవారం డీఏఓ మురళీకృష్ణ పంటకోత ప్రయోగాన్ని పరిశీలించారు. రైతులు రాయల్ మైక్రో ఫుడ్ వాడడం వల్ల వరి పంట ఎత్తు పెరగక, దిగుబడి రాదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పంటకోత ప్రయోగంలో ఎకరాకు 40 బస్తాలు, మిగతా పొలంలో ఎకరాకు 43 బస్తాల దిగుబడి వచ్చిందన్నారు. పొలాల్లో వ్యత్యాసం సర్వసాధారణమని పేర్కొన్నారు. జిల్లా సరాసరి దిగుబడి 35 బస్తాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివరామకృష్ణ, వీఏఏలు సుభాష్ పాల్గొన్నారు.

పాఠశాలల పని గంటలు పెంచడం సరికాదు

నంద్యాల, నవంబరు 20 : (ఆంధ్ర జ్యోతి): అశాస్త్రీయమైన పాఠశాలల పని గంటలను మార్చాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.జాకీర్‌హుసేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనిగంటలు ఉదయం 9నుంచి సాయంత్రం 5 వరకు పొడిగించడం సరైన పద్ధతి కాదన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలోని మండలానికి ఒక ఉన్నత పాఠశాలో ఈ పనివేళలను అమలు చేయడంలో మేలుచేయకపోగా విశ్రాంతిలేకుండా విద్యాప్రగతి కుంటుపడుతుందన్నారు. నిర్విరామంగా 8గంటలు బోధనాతరగతులు ఉంటే ఉపాధ్యాయులు, విద్యార్థుల సామర్థ్యాలపై తీవ్ర ప్రభావం, పనిఒత్తిడి ఉంటుందన్నారు. అసంబద్ధ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు రామచంద్రారెడ్డి, శివయ్య, భాస్కర్‌రెడ్డి, వీరేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాకీర్ హుసేన్

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలల పని వేళలు యథావిధిగా అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామచంద్రారెడ్డి, విజయరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతున్న పనివేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరక పెంచాలన్న ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలన్నారు. బుధవారం తహసీల్దారు షేక్ మొహిద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు.

జీవనోపాధికి రక్షణ కల్పించాలి



నూతన కార్యవర్గంతో గౌరవాధ్యక్షుడు డా. రవికృష్ణ

నంద్యాల, నవంబరు 20 : (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చిన్న, వీధి వ్యాపారస్తుల జీవనోపాధికి రక్షణ కల్పించాలని జిల్లా చిన్న, వీధి వ్యాపారస్తుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డా.రవికృష్ణ అన్నారు. బుధవారం నంద్యాలలోని మధుమణి సమావేశ భవనంలో కార్యక్రమం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడుగా డా.రవికృష్ణ, గౌరవ సలహాదారుడిగా ప్రముఖ న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు, అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఉమామహేష్, కో ఆర్డినేటర్లుగా రమేష్, శివరామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా అజీజ్‌ఖాన్, వెంకటరమణతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డా.రవికృష్ణ మాట్లాడుతూ చిన్న, వీధి వ్యాపారస్తుల సంక్షేమానికి ప్రభుత్వం సహకరించాలని, 2014 కేంద్ర వీధి వ్యాపారస్తుల జీవనోపాధి రక్షణ చట్టం ప్రకారం ప్రతి పట్టణంలో మున్సిపాల్టీ, ట్రాఫిక్ పోలీసులు, ప్రజాప్రతినిధులతో టౌన్ వెండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. కమిటీ ద్వారా మెప్మా ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని, పట్టణ కూడళ్లలో వెండింగ్ జోన్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి

నంద్యాల క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణాల సమయంలో రోడ్డు భద్రతపై వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నంద్యాల ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జునగుప్త సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నంద్యాల జిల్లాలో సేఫ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జునగుప్త ఆధ్వర్యంలో బుధవారం రామనాథరెడ్డినగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ హెల్మెట్‌లేకుండా ప్రయాణించడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడపడం, సీటు బెల్టు ఉపయోగించకపోవడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. ఈ విషయాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులతోపాటు ఇతరులకు కూడా అర్థమయ్యేలా చెప్పాలని సీఐ సూచించారు. అనంతరం దాదాపు 250మంది విద్యార్థులతో స్కూల్ నుంచి పద్మావతినగర్, శ్రీనివాససెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే మానవహారం నిర్వహించారు. ర్యాలీ ముగింపు సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు వాహనదారులకు రోజా పూలు అందించారు.కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, శ్రీచైతన్య స్కూల్ ఏజీఎం జి.సురేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ బి.రాధ, డీన్ దస్తగిరి, ప్రైమరీ ఇన్‌చార్జి జి.సరిత, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త

డ్రైనేజీ పనులు ప్రారంభం



చాగలమర్రిలో పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పట్టణంలో మురుగు కాలువల నిర్మాణ పనులను టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, నాల్గోవ ఎంపీటీసీ ఇంచార్జి జెట్టి నాగరాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ సమస్య తీర్చేందుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో రూ.50 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టామని అన్నారు. బీసీ బాలికల వసతి గృహం నుంచి శ్మశానం వరకు కాలువ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మౌలాలి, హనిఫ్, గౌస్, జెట్టి సురేష్, ప్రసాద్, కుమార్, సాయి, రాజేంద్ర, టైలర్ ఖాదర్, రాజేష్, మాబుపీరా, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీ చివరి ఆయకట్టుకు నీరందించాలి

- అసెంబ్లీలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో గళం విప్పారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కేసీ కెనాల్ ప్రధాన వనరుగా పంటలు సాగు చేస్తున్న రైతులకు ఏటా ఖరీఫ్, రబీలో నీరందక పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని అసెంబ్లీలో సభాపతిని కోరారు. ముచ్చుమర్రి వద్ద అదనంగా మూడు పంపులను ఏర్పాటు చేయాలని కోరారు. కర్నూలు, కడప జిల్లాల్లోని లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందించేందుకు గుండ్రేవుల ప్రాజెక్టు పనులను త్వరితగతిన ప్రారంభించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ప్రారంభించిన తెలుగు గంగ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూషన్ ఛానల్స్ నేటికీ పూర్తి చేయ లేదన్నారు. కేసీ కెనాల్, తెలుగు గంగ కాల్వల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అసెంబ్లీలో చర్చించారు.

'పనివేళల్లో మార్పు సరికాదు'

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పనివేళల్లో మార్పు సరికాదని ఎస్టీయూ, పీఆర్టీయూ సంఘ నాయకులు శివశంకర్, నారాయణమూర్తి, మహబూబ్‌బాషా అన్నారు. బుధవారం పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో ఎంఈవోకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ, పీఆర్టీయూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలను జయప్రదం చేయాలి

డోన్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్యం శెట్టిలు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పట్టణంలో జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 24న జరిగే జిల్లా మహాసభలకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర పునర్నిర్మాణం



మాట్లాడుతున్న రామకృష్ణ

డోన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు విశేషంగా శ్రమిస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని వలసల గ్రామంలో రామకృష్ణ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే వారి ఖాతాల్లో నగదును జమ చేస్తుండటంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుండటంతో పెద్ద ఎత్తున పరిశ్రలు రాబోతున్నాయని అ న్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు.

మెరుగైన విద్యను అందించాలి



పాఠశాలను తనిఖీ చేస్తున్న డీఈవో

బనగానపల్లె , నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని నంద్యాల జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని యనకండ్ల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. డీఈవో మాట్లాడుతూ మెరుగైన విద్యను ఉపాధ్యాయులు అందించినప్పుడే శాశ్వత గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామకృష్ణ, హెచ్‌ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు నరసయ్య, తదిరతులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

డోన్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డోన్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు డోన్ కోర్టు వద్ద నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడు, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు మాట్లాడుతూ కర్నూలులో ఉన్న హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్, ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కోర్టులను అమరావతికి ప్రభుత్వం తరలించాలన్న ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాశీం సాహెబ్, మహేశ్వరరెడ్డి, శేషసైనారావు, మధుసూదన్, కృష్ణమూర్తి, శ్రీరాములు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారిస్తాం

- కలెక్టర్ రాజకుమారి
- వాటర్ ప్లాంట్ పరిశీలన



వాటర్‌గ్రిడ్ ప్రతినిధి నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్


బేతంచెర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గోరుకల్లు వాటర్ గ్రిడ్ వాటర్ ప్లాంటు ద్వారా రానున్న వేసవిలో బేతంచెర్ల, డోన్ మండలాల ప్రజలకు నీటి ఎద్దడి నివారణకు శుద్ధజలాన్ని సరఫరా చేస్తామని కలెక్టర్ రాజకుమారి గనియా తెలిపారు. బుధవారం మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ ప్లాంట్ మెగా కంపెనీ చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించారు. ముందుగా గోరుకల్లు రిజర్వాయర్‌ను పరిశీలించిన తర్వాత మెగా కంపెనీ చేపట్టిన శుద్ధజల ప్లాంట్ నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోరుకల్లు వాటర్ గ్రిడ్ పథకం ద్వారా 138 గ్రామాలకు చెందిన 2.86 లక్షల మంది ప్రజలకు మినరల్ వాటర్‌ను అందిస్తున్నామని తెలిపారు. 66 ఓహెచ్‌ఆర్ ట్యాంకుల ద్వారా శుద్ధజలాన్ని ప్రజలకు సరఫరా చేస్తామని తెలిపారు. గోరుకల్లు నుంచి డోన్ వరకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరా అందించేందుకు నాలుగు సంపుల ద్వారా సరఫరా చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ పథకం ద్వారా మార్చి నాటికి ప్రజలకు శుద్ధజలం అందజేస్తామని తెలిపారు. కలెక్టర్ వెంట డోన్ ఆర్డీవో నరసింహులు, డోన్ తహసీల్దార్, బేతంచెర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, ప్రాజెక్టు డీఈ సోమశేఖర్, ప్రాజెక్టు ఏఈలు బాలకృష్ణ, మనోజ్, ఎల్లరాజు, జయదీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్, మెగా కంపెనీ ప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కోవెలకుంట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలో బుధవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఉదయం అయ్యప్పస్వాములు చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి అయిన మురళీక్రిష్ణ, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వర్‌రెడ్డి స్వామితో పాటు పలువురు అయ్యప్పస్వాములు అయ్యప్పస్వామికి కలశపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అయ్యప్పస్వామి రథంపై ఎక్కించి కేరళకు చెందిన ప్రత్యేక డప్పు వాయిద్యాల మధ్య గ్రామోత్సవం సాగింది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు, ముదిగేడు సర్కిల్, బనగానపల్లె సర్కిల్, సంతమార్కెట్‌వీధుల గుండా ఊరేగింపు సాగింది.



కోవెలకుంట్లలో గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్పస్వాములు



అవుకులో అయ్యప్పస్వామి గ్రామోత్సవం

అవుకు : అవుకు పట్టణంలోని అయ్యప్పస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. గురుస్వాములు వెంకటరమణనాయక్, టైలర్ సుబ్బయ్య ఆధ్వర్యంలో భక్తాదులు అరటి బెరడులతో అలంకరణ చేసిన పల్లకిలో స్వాముల వారిని ఉంచి పూజలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: శిరివెళ్లలోని అయ్యప్పస్వామి భక్తులు బుధవారం స్వామికి భక్తిశ్రద్ధల తో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారిశాలలో వేకువజామునే అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పల్లకిలో కొలువుదీర్చి మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం రాత్రి అమ్మవారిశాలలో మహాపడి పూజ నిర్వహించారు.



శిరివెళ్లలో అయ్యప్పస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

బనగానపల్లె , నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం గ్రంథాలయాధికారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో 57వ శాఖాగ్రంథాలయ ముగింపు ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా బీసీ రాజారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయాధికారి బషీర్ అహ్మద్, రిటైర్డు హెచ్‌ఎం శ్రీరాములు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మధు, లక్ష్మిరెడ్డి, లక్ష్మణమూర్తి, పాఠకులు యాగంటయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : మండలకేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఆయాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, గ్రంథాలయ అధికారి సంగీత లక్ష్మి, పలువురు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

మెరుగైన వైద్యం అందిస్తాం

ఉయ్యాలవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో మెరుగైన వైద్యం అందించడం కోసమే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వైద్యాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. బుధవారం అల్లూరు గ్రామంలో వైద్య క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఆయా గ్రామాల్లో వైద్య క్యాంపులు ఏర్పాటు చేస్తున్నమన్నారు. గ్రామాల్లోని ప్రజలకు బీపీ, షుగరు, జ్వరం, దగ్గు తదితర రోగాలున్న వారిని గుర్తించి వారికి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రైతు కార్మిక ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో రైతు సంఘం సీఐటీయూల ఆధ్వర్యంలో మండల నాయకుడు రహంతుల్లా అధ్యక్షతన జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లయ్య ఆటో జాత జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణన్న, సుబ్బడు,ఫకీర్, తిమ్మయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

'తల నీలాల వేలం నిర్వహించాలి'

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బేతంచర్ల మండలం రంగాపురం మద్దిలేటి నరసంహస్వామి దేవాలయంలో తల నీలాల వేలం నిర్వహించాలని చాగలమర్రికి చెందిన కేవీఎస్ ఎంటర్‌ప్రైజేస్ అధినేత రామాంజనేయులు, నర్సమ్మ కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ ఈనెల 15న వేలం నిర్వహించారని అన్నారు. హైదరాబాదు, హిందూపూర్, అద్దంకి, చాగలమర్రికి చెందిన వేలందారులు పాల్గొన్నారని అన్నారు. ఈవో రామాంజనేయులు వేలం పాటలు నిర్వహించకుండా ప్రొద్దుటూరుకు చెందిన వేలందారులకు అందజేశారని వారు ఆరోపించారు. తిరిగి వేలం నిర్వహించాలని కమిషనర్ ఆదేశించిన ఈవో పట్టించుకోలేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తిరిగి వేలం పాటలు నిర్వహించాలని వారు కోరారు.

24న మెగా వైద్య శిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

సంజామల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగంపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఈ నెల 24న నిర్వహించనున్న నంద్యాల గురురాజా, రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి తెలిపారు. బుధవారం మెగా వైద్యశిబిరం పోస్టర్‌ను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ కోవెలకుంట్ల, సంజామల మండలాల తదితర గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో తన సొంత ఖర్చులు వెచ్చించి ప్రతి నెల చివరి ఆదివారం వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అరుణ్



అవుకు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవుకు పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త అరణ్‌కుమార్‌నాయక్ నియమి తులయ్యారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌నాయక్ మాట్లాడుతూ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సహకారంతో గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువ

రూరల్ సీఐ కంబగిరి రాముడు



చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలకు చేరువ అవుతూ నేర నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామని ఆళ్లగడ్డ రూరల్ సీఐ కంబగిరి రాముడు అన్నారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ట్రాఫిక్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. ఉదయం, సాయంత్రం వేళల్లో సిబ్బందితో క్రమబద్ధీకరిస్తున్నాం. హైవే రహదారిలో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక నిఘా ఉంచాం.. వాహనదారులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. వాహనాల రద్దీని నియంత్రిస్తున్నాం. చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచిస్తున్నాం.

ప్రశ్న: చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: గ్రామాల్లో చట్టాలపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నాం. కోర్టు ద్వారా ఎటువంటి శిక్షలు పడతాయన్న వాటిపై ప్రజలకు వివరిస్తున్నాం.

ప్రశ్న: శాంతి భద్రతలకు పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆకతాయిలు, మద్యంబాబులు గొడవపడితే అదుపులోకి తీసుకొని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేస్తున్నాం. అవసరమైతే కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: బహిరంగ మద్యపానంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: బహిరంగంగా మద్యం తాగడం చట్టవిరుద్ధం. దీనిపై ప్రజలకు అవగాహన పెంచుతున్నాం. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించి బహిరంగంగా మద్యం తాగేవారికి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. రహదారుల్లో మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్రశ్న: ఇసుక, మట్టి దందా నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే అక్రమంగా ఇసుక, మట్టి తరలించేవారిపై పలు కేసులు నమోదు చేశాం.

గృహ నిర్మాణాన్ని వేగవంతం చేయండి



గృహ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న డీఈ విజయబాబు

రుద్రవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని డీఈ విజయబాబు అన్నారు. బుధవారం మండలంలోని ఆలమూరులో గృహ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఎప్పటికప్పుడు గృహాలు పరిశీలించి లబ్ధిదారులను అప్రమత్తం చేయాలని సూచించారు. నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. ఆయన వెంట హౌసింగ్ సిబ్బంది ఆనంద్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు భిక్ష

కొలిమిగుండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొలిమిగుండ్లలో అయ్యప్పస్వామి, శివస్వామి మాలధారులకు ముస్లిం యువకుడు భిక్ష(అన్నదానం) ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటాడు. గ్రామానికి చెందిన హసేన్‌బాషా సుమారు 60మంది అయ్యప్ప, శివ భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. స్వాములకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా కార్తీక మాసం పూజలు

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవీశ్వర, బుగ్గమల్లేశ్వర, రామలింగేశ్వర, భీమలింగేశ్వర ఆలయాల్లో బుధవారం కార్తీకమాస పూజలు చేశారు. పాత శివాలయంలో సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో విష్ణుసహస్ర పారాయణం, సామూహిక ఒడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. శివపార్వతుల పల్లకితో ఊరేగింపు చేశారు. భైరవీశ్వర ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలంపాడు గ్రామానికి చెందిన గుర్రమ్మ (79) కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. ఈనెల 16న సాయంత్రం గుర్రమ్మ ఇంటి వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడింది. కుటుంబీకులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక గుర్రమ్మ మృతి చెందిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్లాస్టిక్‌ను వాడొద్దు: బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను వాడొద్దని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఎస్‌ఎస్‌ఎస్ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ క్యాన్సర్ కారకాలైన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఇంటింటా చెట్లు నాటి పచ్చదనం పెంచాలని కోరారు. కార్యక్రమంలో టంగుటూరు శ్రీనయ్య, టీచర్ నాగరాజు, అధ్యాపకులు రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన ఉండాలి

కొలిమిగుండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం ప్రతి మనిషికి హక్కులు కల్పించిందని, ప్రతి ఒక్కరూ మానవ హక్కులపై అవగాహన ఉండాలని సీఐ రమేష్‌బాబు, తహసీల్దార్ బాలీశ్వరరెడ్డి సూచించారు. బుధవారం స్థానిక లిటిల్‌ఫ్లవర్ ఉన్నతపాఠశాలలో హ్యూమెన్ రైట్స్ ప్రొటెక్షన్ సంస్థ వారి ఆధ్వర్యంలో మానవ హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఎంఈవో అబ్దుల్ కలాం, డా.హరిచరణ్‌రెడ్డి, హెచ్‌ఎం సుంకన్న, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

హోంగార్డులకు శారీరక దారుఢ్యంపై శిక్షణ



పరేడ్ నిర్వహిస్తున్న హోంగార్డు ఇన్‌చార్జి, ఆర్ఐ నాగభూషణం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ కళాశాల క్రీడామైదానంలో బుధవారం పోలీసు పరేడ్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఆళ్లగడ్డ సర్కిల్ పరిధిలోని హోంగార్డ్‌లకు నంద్యాల జిల్లా హోంగార్డు ఇన్‌చార్జి నాగభూషణం శారీరక దారుఢ్యంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరు విధి నిర్వహణలో క్రమశిక్షణతో మెలగాలని ఆయన సూచించారు.

అనాథలకు దుప్పట్లు పంపిణీ

చాగలమర్రి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగల్లపాడు అనాథాశ్రమంలో బుధవారం అనాథలకు దుప్పట్లను ప్రముఖ వ్యాపారవేత్త చక్రం బీడీ షబ్బీర్‌అహ్మద్, ఉల్లా రఫి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి షేక్.బాబులాల్ జన్మదినం సందర్భంగా 30మందికి దుప్పట్లను అందజేశారు. వైసీపీ నాయకులు ఖాదర్‌బాష, రఫి, అబ్దుల్లా, ఇస్మాయిల్, జిలాన్, గౌస్, సిద్ధిక్ పాల్గొన్నారు.

బ్రూ సెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు

డోన్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నాలుగు నుంచి ఎనిమిది మాసాల గేదెలు, ఆవుదూడ, పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద ఈ నెల 20నుంచి వచ్చే నెల 19వరకు టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాఠశాలకు బీరువాలు విరాళం

ప్యాపిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపూదిళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బుధవారం బీరువాలను విరాళంగా ఇచ్చారు. డోన్ ఆర్టీసీలో పనిచేస్తున్న శాంతమ్మ, క్రిష్ణగిరి మండలంలోని అలంకొండ గ్రామానికి చెందిన మాబు కుటుంబ సభ్యులు కలిసి బీరువాలను సిబ్బందికి అందజేశారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

ప్యాపిలి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరేడుచెర్లలో విద్యుదాఘాతంతో బుధవారం నాగరత్నమ్మ(69) వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. పొలానికి వెళ్లిన వృద్ధురాలు తెగిపడిన విద్యుత్ తీగలను ప్రమాదవశాత్తు తొక్కి అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదపుటంచున ప్రయాణం



అంకిరెడ్డిపల్లెలో ఆటోలో పరిమితికి మించి ఎక్కిన కూలీలు

కొలిమిగుండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కూలీ పని కోసం ప్రమాదపుటంచున ప్రయాణం సాగిస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నా ఇటు కూలీలు, అటు ఆటోవాలల తీరులో మార్పు రాకపోవడం తీవ్ర బాధాకరం. మండలంలోని అంకిరెడ్డిపల్లె, చింతలా యపల్లె గ్రామాల నుంచి మహిళా కూలీలు అనంతపురం జిల్లాకు పనులకు తరలి వెళ్తున్నారు. ఈ సమయంలో అత్యంత ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్న పరి స్థితి చూపరులకు సైతం తీవ్ర ఆం దోళన కలిగిస్తోంది. కేవలం ముగ్గురు వ్యక్తులు ప్ర యాణించాల్సిన ఆటోలో 30మంది ప్రయా ణిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరు గుతుందో తెలియని పరిస్థితి. గతంలో మం డలంలోని కనకాద్రిపల్లె, నాగిశెట్టిపల్లె గ్రా మాల వద్ద కూలీల ఆటోలు బోల్తా పడి, ఆ రుగురు మహిళలు మృత్యువాత పడిన ఘట నలు ఉన్నాయి. సంబంధిత అధికారులు కూలీలకు, ఆటోవాలాలకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

కొలిమిగుండ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మనాయినిపేట గ్రామం వద్ద నాటుసారా తరలిస్తున్న వెంకటరాముడు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ స్వాడ్ సీఐ లక్ష్మన్‌దాస్, ఎస్ఐ రమేష్‌బాబు బుధవారం తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాలమేరకు తనిఖీలు నిర్వహిస్తుండగా వెంకటరాముడు 120లీటర్ల సారా ప్యాకెట్లు మోటార్‌సైకిల్‌పై తరలిస్తుండగా అరెస్ట్ చేసి, మోటార్‌సైకిల్‌తో పాటు, నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిబ్బంది ఓబులేసు, నాగరాజు, పాములేటి, రవికుమార్ పాల్గొన్నారు.

పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రుద్రవరం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.నాగలవరం గ్రామంలో పెద్దమ్మ అమ్మవారి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాలనుంచి ప్రజలు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.